(మినీ కథ)

# — తెరవెనుక కథ —

రాత్రి పది గంటల సమయం. ఇంజనీరింగ్ హాస్టల్ గదులన్నీ విద్యుద్దీపాలతో కలకలలాడుతున్నాయి. స్టూడెంట్లందరిలోను చదువు పట్ల పట్టుదల, దీక్ష, పరీక్షలు బాగా రాసి భవిష్యత్ సుగమం చేసుకోవాలని ఆరాటం!

ఉన్నట్టుండి అసెంబ్లీ హాల్ వద్ద ఏదో అలజడి, స్టూడెంట్లందరూ పుస్తకాలు వదిలేసి హాల్ కేసి దారితీశారు. అక్కడ ఫైనల్ బి.ఇ. స్టూడెంట్లు నల్గురు కేంటిన్ రంగనాథాన్ని ఆరున్నర శృతిలో బూతులతో తిడుతున్నారు. రంగనాథం వాళ్ళ పట్ల చాల అసభ్యంగ ప్రవర్తించాడట! టిఫిన్ కోసం వస్తే టిఫిన్ ఉండికూడ లేదని పొమ్మన్నాడట! వాడి ఆడవాళ్ళతో అసభ్యంగ ప్రవర్తించినట్టు నింద వేశాడట! నీళ్ళిమ్మంటే ఉప్పు కలిపిన నీళ్ళిచ్చాడట! టీ ఇమ్మంటే పంచదార కలపని డికాషన్ నీళ్ళు యిచ్చాడట! ఏమని నిలదీసి అడిగితే ఆ డికాషన్ నీళ్ళు ముఖాన విసిరికొట్టాడట! ఆ పనులన్నీ కేంటిన్ లో టీలు తీసుకొంటున్న యిద్దరు మెడిసన్ చదూతున్న అమ్మాయిల ముందర చేశాడట! ఇంజనీరింగ్ కాలేజీని ఇంజనీరింగ్ స్టూడెంట్లను ఆ అమ్మాయిల ముందర తెగతిట్టాడట!

పరాభవాలను తలచుకొని ప్రతీకార వాంఛతో ఆ నలుగురూ అరచి చెపుతుంటే భావి ఇంజనీర్లలో పౌరుషం కట్టలు తెగింది. రంగనాథం ప్రవర్తించిన తీరుకి రెచ్చిపోయారు. స్టూడెంట్ల దండు కదిలింది. వాళ్ళలో ఆవేశం విజృంభించింది. కేంటిన్ కార్నర్ లో జనసంచార మంతగా లేదు. రంగనాథం దండును చూశాడు. పరిస్థితి అర్థమైపోయింది. కాళ్ళలో వణుకు సన్నగా ఆరంభమయింది. దణ్ణం పెడుతూ దండు ముందుకు వచ్చాడు. దండు జాలిపడలేదు. ఒక్క తోపుతో రంగనాథం మురికి కాలువలో పడ్డాడు. దండు కేంటిన్ ని ఆక్రమించుకొంది. గల్లాపెట్టె తాళం విరిగింది. కరెన్సీ మాయమయింది. ఖాతా పుస్తకాలు మండుతున్న పొయ్యిలోకి ఎగిరాయి. బీరువా అద్దాలు ముక్కలు ముక్కలుగా క్రిందపడ్డాయి. కాలువనుండి లేవబోతున్న రంగనాథంపై పళ్ళేలు, గ్లాసులు వర్షలా పడుతున్నాయి.

పది నిముషాల్లో అంతా అయిపోయింది. దండు తిరుగు ముఖం పట్టింది. ఆవేశాలు చల్లారాయి. ఎవరి గదులకు వారు చేరిపోయారు. కొద్దిసేపటికి గదుల్లో లైట్లు ఆరిపోయాయి.

అర్ధరాత్రి దాటి వుంటుంది. దండుకు కారకులైన నలుగురూ కిచెన్ వెనకాలచేరి బాటిల్స్ తెరిచారు. ఒక్కొక్క పెగ్గు వేసుకొంటూ రంగనాథం విషయాన్ని ముచ్చటించుకొంటున్నారు.

మొదటి యిద్దరు: 'మీ యిద్దరూ ఛాన్స కొట్టేరు. పొయ్యిలోపడిన ఖాతా పుస్తకాలు మసి అయ్యాయి. అయిదేసి వందలు మీకు మిగులు'

తరువాత యిద్దరు: 'మీరేం తక్కువ తిన్నారా! మీ చేతికి అంతకన్నా ఎక్కువే పడ్డాయి'.

నలుగురూ ఆనందం పట్టలేక కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుతున్నారు. ఆ నవ్వులు వినిపించని తెరలు కప్పుకొని నిద్రపోతున్నారు రూముల్లో విద్యార్థులు.

— శ్రీ బెలగాం భీమేశ్వరరావు.